సాక్షి సూర్యాపేట

మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



బుద్ధుడి బోధనలే శరణ్యం

సమాజ రుగ్మతలను రూపుమాపడానికి బుద్ధుడి బోధనలే శరణ్యమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 61,440 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 40,912 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,907 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 3,257 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,948 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 644.30 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 910 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,147 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 243 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 170 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

17న సీఎం కప్ టార్చ్ ర్యాలీ

సూర్యాపేట టౌన్: ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి కల్నల్ సంతోష్‌బాబు చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్ వరకు సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు జిల్లా యువజన, క్రీడల అధికారి జి.రాంచందర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యదాద్రి భువనగిరి జిల్లా నుంచి సూర్యాపేట జిల్లాకు వస్తున్న టార్చ్ ర్యాలీ టీమ్‌కు స్వాగతం పలకడానికి జిల్లాలోని జాతీయ, అంతర్జాతీయ, సీనియర్ క్రీడాకారులు, పీఈటీలు, పీడీలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, క్రీడా సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి

సూర్యాపేట టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ, సామాజిక సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నల్లగొండ జిల్లాలో యురేనియం తవ్వకాల గురించి శాసన మండలిలో ప్రస్తావించానన్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికుల నియామకానికి కృషిచేశానన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక తరగతులు ప్రవేశపెట్టే విధానాన్ని కౌన్సిల్లో వ్యతిరేకించానన్నారు. ఉపాధ్యాయ ఉద్యమం బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు రాములు, ఎన్.సోమయ్య, ఎస్.అనిల్‌కుమార్, యాకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జి.వెంకటయ్య, ఆర్.దామోదర్, ఎస్.నాగేశ్వరరావు, రమేష్, పాండురంగాచారి పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో 'పేట' విద్యార్థులకు మెడల్స్



మెడల్స్‌తో విద్యార్థులు

సూర్యాపేట టౌన్: ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి చెస్ పోటీల్లో సూర్యాపేటకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్టు కోచ్ సాయికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడల్స్ సాధించిన వారిలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో సాయి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు జిల్లేపల్లి తనయ్, బామర్ లక్షిత్, జ్యోతుల రిషికృష్ణ, గడ్డం జైసాకేత్‌లు ఉన్నారు. వీరికి కోచ్‌తో పాటు ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు జానయ్య తదితరులు అభినందించారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మంగళవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. దసరా పండుగ నేపథ్యంలో ఈనెల 2నుంచి 14వ తేదీ వరకు విద్యా శాఖ సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. సెలవులు ముగియడంతో నేటి నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయని డీఈఓ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుగు ప్రయాణం తిప్పలు






రాష్ట్ర రాజధానితోపాటు వివిధ పట్టణాల్లో ఉంటూ దసరాకు సొంతూళ్లకు వచ్చిన జనం పండుగ ముగియడంతో తిరుగు పయనమవుతున్నారు. దీంతో సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు అందుబాటులో లేక ఇబ్బందులు పడ్డారు. ఇతర వాహనాల్లో వెళ్లేందుకు జనం బస్టాండ్ నుంచి బయటకి వచ్చి రోడ్లపై నిరీక్షిస్తూ కనిపించారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

కొలువుదీరనున్నారు..

కొత్త టీచర్లకు నేడు పోస్టింగ్ ఆర్డర్లు

- మెరిట్ ప్రకారం కౌన్సెలింగ్
- డీఈఓ కార్యాలయంలో ఏర్పాట్లు
- రేపు విధుల్లో చేరనున్న 322 మంది నూతన ఉపాధ్యాయులు



సూర్యాపేట టౌన్: డీఎస్సీ-2024కి ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు మంగళవారం పోస్టింగ్ ఆర్డర్లు అందించేందుకు విద్యా శాఖ సిద్ధమైంది. కొత్త ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు మూడు రోజుల నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ జిరాక్స్, జాయినింగ్ లెటర్లు సమర్పించారు. వీరందరికీ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ గల డీఈఓ కార్యాలయంలో మంగళవారం పోస్టింగ్ ఆర్డర్‌లు ఇవ్వనున్నారు. బుధవారం వెంటనే పాఠశాలల్లో చేరనున్నారు.

మెరిట్ ఆధారంగా పోస్టింగ్..

జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో మంగళవారం స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్‌జీటీల ఖాళీల జాబితాను ప్రదర్శించనున్నారు. ఈ జాబితాలో తమకు నచ్చిన పాఠశాలను కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు ఎంపిక చేసుకుంటే వెంటనే పోస్టింగ్ ఇవ్వనున్నారు. అయితే నూతన ఉపాధ్యాయులు మెరిట్(ర్యాంకుల) ఆధారంగా ఖాళీల పోస్టులను ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. అనంతరం మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి తాము ఎంపిక చేసుకున్న పాఠశాలకు పోస్టింగ్ ఇస్తారు.

రేపు స్కూళ్లకు కొత్త టీచర్లు

డీఈఓ కార్యాలయంలో పోస్టింగ్ తీసుకునే నూతన ఉపాధ్యాయులు వెంటనే బుధవారం నుంచి తమకు పోస్టింగ్ ఇచ్చిన పాఠశాలలో జాయిన్ కానున్నారు. జిల్లాలో 322 పోస్టులు భర్తీ చేశారు. అందులో 83 స్కూల్ అసిస్టెంట్‌లు, 19 లాంగ్వేజి పండిట్‌లు, 5 పీఈటీ పోస్టులు, 215 ఎస్‌జీటీల పోస్టులు ఉన్నాయి.

పాఠశాలల్లో తీరనున్న ఉపాధ్యాయుల కొరత

ఇక నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరనుండడంతో జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొంత మేర తీరనుంది. జిల్లాలో 687 ఖాళీలు ఉన్నట్టు విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఇందులో 508 ఎస్‌జీటీ పోస్టులే ఎక్కువగా ఖాళీ ఉన్నాయి. అలాగే ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల కారణంగా పెద్ద ఎత్తున ఎస్‌జీటీ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రాథమిక పాఠశాలల్లో బోధన కుంటు పడింది. అలాగే ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు సరిపోను లేక విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడ్డారు. ప్రస్తుతం జిల్లాలో కొత్తగా 215 మంది ఎస్‌జీటీలు, 83 మంది ఎస్ఏలు రానుండడంతో ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి



డీఎస్సీ-2024కు ఎంపికైన స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్‌జీటీలు మంగళవారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో డీఈఓ కార్యాలయానికి రావాలి. కార్యాలయంలో ఖాళీల జాబితాను ప్రదర్శిస్తాం. ర్యాంకుల ఆధారంగా ఉపాధ్యాయులు వాటిని ఎంపిక చేసుకుంటే మ్యానువల్ కౌన్సెలింగ్ ఇచ్చి వెంటనే పోస్టింగ్ ఇస్తాం. పోస్టింగ్ తీసుకున్న వారు బుధవారం నుంచి ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరాలి. 70 మంది ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లు వెంటనే రిలీవ్ కావాలి.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో పత్తి, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్.లతతో కలిసి కలెక్టర్.. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో ప్రతి మండలంలో సన్న రకం, దొడ్డు రకం వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రం ప్రారంభించాలన్నారు. పత్తి కొనుగోళ్లకు ఏడు మిల్లుల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. తేమ కొలిచే యంత్రాలు, పాడి క్లీనర్స్‌ను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు, టార్పాలిన్లు, గన్నీబ్యాగులు అందుబాటులో ఉంచాలని డీఆర్‌డీఓకు సూచించారు. ప్రభుత్వం జీఓ విడుదల చేసిన నేపథ్యంలో గ్రామాలు, మున్సిపాలిటీల్లో త్వరగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ కింద నియోజకవర్గానికి ఒక గ్రామం, ఒక్క వార్డు సర్వే పూర్తి చేశామని, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించి 9, జిల్లా పంచాయతీ అధికారికి 6, డీఆర్‌డీఓకు 3, వ్యవసాయ శాఖకు 3, డీడబ్ల్యూఓకు 2, ఇతర శాఖలకు 9 చొప్పున మొత్తం 32 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, డీఈఓ అశోక్, డీసీఓ పద్మ, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, సంక్షేమ అధికారులు శంకర్, లత, జగదీశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పట్టాలు ఇవ్వాలని వినతి

సూర్యాపేట పట్టణంలోని కుడకుడలో పేదలు నివాసముంటున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్లగా నిరుపేదలు గుడిసె వేసుకుని నివాసముంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అఖిల్‌కుమార్, పట్టణ కార్యదర్శి గులాబ్ హుస్సేన్, ఐఎఫ్‌టీయూజిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు పిడమర్తి లింగయ్య, సయ్యద్, జయమ్మ, సంతోషి, పద్మ, గౌరమ్మ, మోహన్, సంధ్య, రాజేష్ పాల్గొన్నారు.



పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు

నాలుగు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

భానుపురి (సూర్యాపేట): పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా జిల్లాలో కొత్తగా నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, మార్పులు, చేర్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రం, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మూడు నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మేళ్లచెరువు మండలం దుబ్బతండా, చింతలపాలెం మండలం వజినేపల్లి, గరిడేపల్లి మండలం చిన్నగారకుంట తండాలో నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నాలుగు పోలింగ్ కేంద్రాల లోకేషన్లను, మరో రెండు పోలింగ్ కేంద్రాల పేర్లు మార్చడం కోసం, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మద్దిరాల మండలం గుంటగాని తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు, ఒక పోలింగ్ కేంద్రం లోకేషన్ మార్పు ప్రతిపాదన పంపినట్లు చెప్పారు. కోదాడ నియోజకవర్గంలో ఎలాంటి మార్పులు చేర్పులు జరగలేదన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు శ్రీనివాసులు, వేణుమాధవ్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, తహసీల్దార్లు శ్యాంప్రసాద్ రెడ్డి, వాజీద్, నాగేందర్, దయానందం, పలు పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వరరావు, సత్యనారాయణ, హబీదు, స్టాలిన్, రమేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు తుపాను గుబులు!

- జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలు
- కోత దశలో వరిపొలాలు
- ఆందోళనలో అన్నదాతలు



సూర్యాపేట సమీపంలో కోతకు సిద్ధంగా ఉన్న వరిపొలం

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో వరి రైతులకు తుపాను గుబులు పట్టుకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు సైతం వీస్తున్నాయి. దీంతో వరిపొలాలకు నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

కోతకు సిద్ధంగా పొలాలు

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4.72లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి పంటను సాగు చేశారు. ఇందులో 3.79 లక్షల ఎకరాల్లో సన్నరకం ధాన్యం, 93 వేల ఎకరాల్లో దొడ్డు రకం ధాన్యం సాగైంది. దొడ్డు రకం వరి మూడు నెలలకు, సన్న రకం నాలుగు నెలలకు పంట దిగుబడి వస్తుంది. ఈ క్రమంలో జిల్లాలో ఆగస్టులో బోరు బావుల కింద సాగుచేసిన దొడ్డు రకం వరి ధాన్యం ప్రస్తుతం కోతదశకు వచ్చింది. ఇప్పటికే చాలామంది రైతులు ఈ పొలాలకు నీటి తడులను నిలిపివేశారు. భూములు ఆరగానే పొలాలను కోసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ దీపావళి నాటికి దాదాపు 50 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి కోతకు రానుంది. వాతావరణం అనుకూలిస్తే 20 నుంచి 30 శాతం వడ్లు వ్యవసాయ మార్కెట్లకు చేరే అవకాశముందని రైతులు పేర్కొంటున్నారు.

కలవరపెడుతున్న వర్షాలు

జిల్లావ్యాప్తంగా నాలుగు ఐదు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఓ వైపు ఎండ దంచి కొడుతూనే అక్కడక్కడా కొద్ది సమయానికి మబ్బులు పట్టి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం ఇలాగే ఉంటే సన్నరకం వరికి దోమకాటు వంటి చీడపీడలు ఆశించి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో నాలుగు ఐదు రోజులపాటు తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడం రైతులను మరింత కలవర పెడుతోంది.

అరుణోదయ నాగన్నకు జాతీయ పురస్కారం

నూతనకల్: అరుణోదయ నాగన్నకు యుద్ధగీతి సుద్దాల హనుమంతు జానకమ్మ జాతీయ పురస్కారం ప్రకటించడం హర్షణీయమని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. సోమవారం నూతనకల్ మండల కేంద్రంలో అరుణోదయ నాగన్నకు జాతీయ పురస్కారం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అరుణోదయ నాగన్నకు ఈ నెల 19న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్టు తెలిపారు. 50 ఏళ్లుగా ప్రజల పాటే ప్రస్థానంగా సాగిన అరుణోదయ నాగన్నకు ఎన్ని కష్టాలొచ్చినా పాటను విడువలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా భిక్షపతి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్యామ్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు మున్నా అశోక్, గడ్డం శ్రీను, గంట కార్తీక్, పులుసు రవి, గడ్డం యాదగిరి, తొట్ల రమేష్, వినయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీ ప్రహ్లాదయోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఈ తర్వాత కల్యాణతంతు పూర్తి చేశారు. అలాగే క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పశువుల్లో 'గాలికుంటు'ను నివారించేలా..

- నేటి నుంచి ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ
- జాతీయ పశువ్యాధుల నివారణ పథకం కింద అమలు
- 46 పశువైద్య బృందాల నియామకం
- వచ్చేనెల 14 వరకు కార్యక్రమం



తెల్లజాతి పశువులు	95,148
నల్లజాతి పశువులు	2,89,870
మొత్తం పశుసంపద	3,85,018

హుజూర్‌నగర్: భారతదేశాన్ని గాలికుంటు వ్యాధి రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. జాతీయ పశువ్యాధుల నివారణ పథకం కింద దేశవ్యాప్తంగా ప్రతిఏటా రెండుసార్లు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో మొదటి విడత టీకాలు వేసిన అధికారులు మంగళవారం నుంచి రెండో విడత టీకాలకు సిద్ధమయ్యారు. ఈ ప్రక్రియను 46 బృందాలుగా పశువైద్య సిబ్బంది వచ్చే నెల 14వ తేదీ వరకు కొనసాగించనున్నారు. ఈ క్రమంలో ప్రతి పశువుకి టీకా వేసి చెవిపోగు వేస్తారు. ఆ చెవిపోగు నంబరును ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా..

పశువుల్లో గాలికుంటు వ్యాధి అనేది చాలా ప్రమాదకరమైనది. ఈ గాలికుంటు వ్యాధి అనేది సూక్ష్మాతి సూక్ష్మ క్రిముల ద్వారా సంభవిస్తుంది. ఈ వ్యాధి గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు ఎక్కువగా సోకుతుంది. ఈ వ్యాధి ముఖ్యంగా కలుషిత నీరు, ఆహారం, వాయు కాలుష్యం ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సంభవించిన పశువుల్లో మూతి, కాళ్లకు పుండ్లు పడతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. ఆకలి మందగిస్తుంది. నీరసంగా ఉంటుంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. వ్యవసాయ పనులకు ఉపయోగించే పశువులు నీరసమై పని చేయలేకపోవడం మొదలైన లక్షణాలు కనబడతాయి.

సిబ్బందికి సహకరించాలి



గాలికుంటు వ్యాధి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని రైతులందరూ తమ పశువులకు విధిగా ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి. నెల రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమానికి పశు పోషకులు సహకరించాలి.

– డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పశువైద్యాధికారి, సూర్యాపేట

వ్యాధి ప్రభావం..

ఈ వ్యాధి వల్ల మరణాల శాతం తక్కువగా ఉన్నా వ్యాధి పశువులు ఎల్లప్పుడూ నీరసంగా ఉండి శక్తి సామర్థ్యాలను కోల్పోతాయి. పశువుల చికిత్సలకు అయ్యే ఖర్చు కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి మూలంగా పాలిచ్చే పశువుల్లో పాల నాణ్యత, మేకలు, గొర్రెల్లో మాంసం నాణ్యత గణనీయంగా తగ్గిపోతుంది. అంతే కాకుండా ఎగుమతులపై గణనీయమైన ప్రభావం పడుతుంది. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం జాతీయ పశువ్యాధుల నివారణ పథకం కింద దేశంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సంకల్పించింది.

వెల్లువలా ధాన్యం



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్‌లోనే అత్యధికంగా సోమవారం 8,305 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. క్వింటాకు గరిష్టంగా రూ.2,059, కనిష్టంగా రూ.1,814 ధర పలికింది. వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా సెలవులు రావడంతో సోమవారం అధికంగా ధాన్యం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. - తిరుమలగిరి (తుంగతుర్తి)

క్లుప్తంగా

డీజే వాహనం సీజ్

గరిడేపల్లి: మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో సోమవారం అనుమతులు లేని డీజే వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు. డీజే బాక్సలతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న లచ్యతండా గ్రామానికి చెందిన డీజే నిర్వాహకుడు వాంకుడోతు శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసి డీజే వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చౌటుప్పల్: గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం బ్రిడ్జి వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన సోమవారం సుమారు 45–50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

లారీని ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు

డిండి: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున డిండి మండల కేంద్రంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సుండిపెంటకు చెందిన కరీముల్లా ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి తన కారులో సుండిపెంటకు బయల్దేరాడు. మార్గమధ్యలో సోమవారం తెల్లవారుజామున డిండి మండల కేంద్రంలో హైదరాబాద్– శ్రీశైలం 765 హైవే పక్కన ఆగి ఉన్న లారీని కరీముల్లా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కరీముల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

రాజాపేట: మండలంలోని బొందుగుల గ్రామానికి చెందిన కంచర్ల రామచంద్రారెడ్డి పాడి గేదెలు సోమవారం వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా ఓ గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

నడిరోడ్డుపై జన్మదిన వేడుకలు

- మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద భారీగా ట్రాఫిక్‌జామ్
- అధికార పార్టీ నాయకులు కావడంతో మిన్నకుండిపోయిన పోలీసులు
- డీజేపై మాత్రమే కేసు నమోదు


రాజీవ్ చౌక్ వద్ద జరుగుతున్న బర్త్ డే వేడుకలు


భారీగా నిలిచిపోయిన వాహనాలు

మిర్యాలగూడ అర్బన్: అధికార పార్టీ నాయకుడి పుట్టినరోజు వేడుకలు ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తెచ్చిపెట్టాయి. మిర్యాలగూడ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు క్రేన్‌కు భారీ పూలదండను ఏర్పాటు చేయడంతో పాటు డీజే పెట్టి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించారు. పోలీసులకు ముందస్తు సమాచారం లేకపోవడంతో రాజీవ్ చౌక్ మొత్తం ట్రాఫిక్‌జామ్‌తో నిండిపోయింది. దీంతో నల్లగొండ రోడ్డు వైపు, కోదాడ వైపు వెళ్లే వాహనాలు పట్టణంలోకి వచ్చే వాహనాలు సుమారు అర కిలోమీటర్ మేర నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న వన్‌టౌన్, టూటౌన్ సీఐలు కరుణాకర్, నాగార్జున తమ సిబ్బందితో రాజీవ్‌చౌక్ వద్దకు చేరకుని నిర్వాహకులతో మాట్లాడారు. డీజేను ఆపి అక్కడి నుంచి వాహనాన్ని పంపించాలని పోలీసులు చెప్పడంతో కాంగ్రెస్ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపటి తర్వాత డీజేను అక్కడి నుంచి పంపించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించారు. కాగా ఈ పుట్టినరోజు వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ హాజరు కావడం విశేషం. నడి రోడ్డుపై బర్త్‌డే వేడుకలకు ఎలాంటి అనుమతి లేదని టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. డీజేపై కేసు నమోదు చేశామని నిర్వాహకులపై కూడా కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

బర్త్‌డే వేడుకలపై పట్టణంలో చర్చ..

ప్రధాన రోడ్డును బ్లాక్ చేసి డీజే పెట్టి బర్త్ డే వేడుకలు నిర్వహించమేమిటని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. బడా లీడర్లు కూడా బర్త్ డే వేడుకలకు హాజరై ప్రజల ఇబ్బందులను గుర్తించకపోవడం సరికాదని అంటున్నారు. అధికార పార్టీలో ఉంటే తమ అధికార దర్పం చూపించుకోవాలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆరెగూడెంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

- ఒకరికి గాయాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు


గాయపడిన సాయికిరణ్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెగూడెం గ్రామానికి చెందిన పడసగోని ప్రవీణ్, గంగనబోయిన మహిపాల్ మధ్య రెండేళ్ల క్రితం గొడవ జరిగింది. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో నడుచుకుంటూ వెళ్తున్న ప్రవీణ్‌ను మహిపాల్ అకారణంగా దూషించి అతడిపై దాడి చేశాడు. అదే గ్రామానికి చెందిన అనంతుల సాయికిరణ్ సాయంత్రం మహిపాల్ వద్దకు వెళ్లి ప్రవీణ్‌ను ఎందుకు కొట్టావని అడగగా.. సాయికిరణ్‌పై మహిపాల్‌తో పాటు గంగనబోయిన గోపాల్, గంగనబోయిన మహేందర్ దాడి చేశారు. ఈ దాడిలో సాయికిరణ్ తలకు తీవ్ర గాయమైంది. అనంతరం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. అనంతుల సాయికిరణ్ ఫిర్యాదు మేరకు గంగనబోయిన మహిపాల్, గంగనబోయిన గోపాల్, గంగనబోయిన మహేందర్‌తో పాటు మరి కొంతమందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గంగనబోయిన మహిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతల సాయికిరణ్, అనంతుల లింగస్వామి, పడసగోని ప్రవీణ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

బేతవోలులో 10 మందిపై అట్రాసిటీ కేసు


మాట్లాడుతున్న ఎస్ఐ

చిలుకూరు: మండలంలోని బేతవోలు గ్రామంలో దసరా పండుగ రోజు జరిగిన ఇరువర్గాల ఘర్షణకు సంబంధించి 10 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబుగౌడ్ సోమవారం విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వరకుమార్ భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వట్టికూటి నాగయ్య, వట్టికూటి ధనమూర్తి, వట్టికూటి సతీష్, సాయిలీ నవీన్, ముస్కుల వీరారెడ్డి, కేశగాని నాగేంద్ర, బెల్లకొండ కన్నయ్య, శ్రీలం సైదులు, వంద్రాణపు రామకృష్ణ, వట్టికూటి అంజిబాబుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పండుగ రోజు జరిగిన ఘర్షణలో హత్యాయత్నం కేసు నమోదు అయిన వారిని కోర్టులో రిమాండ్ చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. కోదాడ డీఎస్పీ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వివరించారు.

బ్యాంకు ఎదుట దొంగతనం

- పార్కింగ్ చేసిన బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టిన రూ.50 వేలు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

మోత్కూరు: బ్యాంకు ఎదుట పార్కింగ్ చేసిన బైక్ కవర్‌లో పెట్టిన రూ.50వేలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి చేశారు.ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పోతాయిగడ్డలో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట సోమవారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం పాడిచేడు గ్రామానికి చెందిన ఓర్సు రాజు మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో డీటీడీఎస్ కొరియర్ సర్వీస్‌ను నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం స్థానిక ఎస్‌బీఐ నుంచి రూ.లక్ష డ్రా చేసిన అతడు అందులో నుంచి రూ.50 వేలు తన ప్యాంట్ జేబులో పెట్టుకున్నాడు. మరో రూ.50వేలు బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టారు. ఎస్‌బీఐ దగ్గర నుంచి పోతాయిగడ్డలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్దకు చేరుకొని బైక్‌ను బ్యాంకు ఎదుట పార్కింగ్ చేసి లోపలికి వెళ్లాడు. తను జేబులోని రూ.50వేలు తీసి మరో రూ.50వేలు బైక్ కవర్‌లో పెట్టినట్లు గుర్తొచ్చి వెంటనే బైక్ వద్దకు వచ్చి ట్యాంకు కవర్‌లో చూడగా అప్పటికే గుర్తుతెలియని వ్యక్తులు నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


వీరన్న (ఫైల్)

మోతె: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన మోతె మండలం హుస్సేన్‌బాద్ గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం సూర్యానాయక్‌తండాకు చెందిన జాటోతు వీరన్న(21) సోమవారం తెల్లవారుజామున బైక్‌పై ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గుర్వాయిగూడెంలో ఉంటున్న తన పెద్దనాన్న ఇంటికి వెళ్తుండగా.. మోతె మండలం హుస్సేన్‌బాద్ గ్రామం సమీపంలో 365బీబీ జాతీయ రహదారిపై డివైడర్‌కు ఢీకొట్టి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో వీరన్న తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి జాటోతు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు. మృతుడు సూర్యాపేటలో ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

ఆత్మకూర్ (ఎస్): మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం పాత సూర్యాపేట గ్రామానికి చెందిన ఒంటరి మహిళ ఈ నెల 12వ తేదీన తన కుమార్తెతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన పన్నాల సంతోష్‌రెడ్డి రాత్రి సమయంలో మహిళ ఇంట్లో చొరబడి ఆమెపై అత్యాచారయత్నానికి పాల్ప డ్డాడు. సదరు మహిళ కేకలు వేయడంతో అతడు పారిపోయాడు. సోమవారం సదరు మహిళ తన బంధువులకు విషయం చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రత్నావత్ శంకర్‌నాయక్ తెలిపారు.

అక్రమంగా బాణాసంచా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

భువనగిరి క్రైం: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా బాణాసంచా విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం ఎస్‌ఓటీ పోలీసులు, భువనగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జిట్ట శ్రీకాంత్‌రెడ్డి వీఎస్ఆర్ పశువుల దాణా దుకాణంలో ఎటువంటి లైసెన్స్ లేకుండా బాణాసంచా అమ్ముతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సి. వీరస్వామి తెలిపారు. బాణాసంచాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విషం తాగి యువతి ఆత్మహత్య

భువనగిరి క్రైం: భర్తతో విడిపోయి కుమారుడిని పోషించలేక మనస్తాపానికి గురైన యువతి విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భువనగిరి మండలం నమాత్‌పల్లి బ్రిడ్జి సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కార్మికనగర్‌కు చెందిన నాగారం మమత(27)కు భువనగిరి మండలం నమాత్‌పల్లి గ్రామానికి చెందిన జె. సాయికుమార్‌రెడ్డి డబ్బులు ఇవ్వాల్సి ఉండగా అతడిని డబ్బులు అడిగేందుకు ఆదివారం సాయంత్రం ఆమె నమాత్‌పల్లికి వచ్చింది. డబ్బులు ఇచ్చేందుకు తనకు కొంత సమయం ఇవ్వాలని సాయికుమార్‌రెడ్డి మమతను కోరడంతో ఆమె అక్కడి నుంచి వెనుదిరిగింది. భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న మమత తన కుమారుడిని పోషించేందుకు డబ్బులు లేకపోవడంతో మనస్తాపానికి గురై నమాత్‌పల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి దగ్గరకు చేరుకుని విషం తాగి అకస్మారకస్థితిలోకి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత బైక్‌పై అటుగా వెళ్తున్న సాయికుమార్‌రెడ్డి ఆమెను గమనించి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించాడు. మెరుగైన వైద్యం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఈ మేరకు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిప్పర్తి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం గ్రామానికి చెందిన కొత్త లింగయ్య (79) ఆదివారం రాత్రి గ్రామ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింగయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలున్నారు. మృతుడి కుమారుడు కొత్త వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..


మనీష్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన బెలిదె మనీష్ (24) నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. మనీష్ జూన్ 18న హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి రాత్రి బైక్‌పై ఇంటికి వస్తుండగా.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్ మండలం ఎదులాబాద్ వద్ద కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు పరిస్థితి శస్త్రచికిత్స చేయాలని సూచించారు. కిరాణం షాపు నిర్వహిస్తూ జీవనాన్ని సాగిస్తున్న మనీష్ తల్లిదండ్రులు తెలిసిన చోటల్లా అప్పులు చేసి తలకు శస్త్రచికిత్స చేయించారు. నెలరోజుల తర్వాత ఇంటికి పంపించారు. ఇంటికి వచ్చిన పది రోజులకే పరిస్థితి విషమించడంతో తిరిగి మరో ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. పోస్ట్‌మార్టం నిమిత్తం మనీష్ మృతదేహాన్ని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పాముకాటుతో రైతు మృతి


లింగారెడ్డి (ఫైల్)

వేములపల్లి (మాడ్గులపల్లి): పాముకాటుకు గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం సిలార్‌మియాగూడేనికి గుడిపల్లి లింగారెడ్డి(60) ఆదివారం సాయంత్రం మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో పనులు చేసేందుకు వెళ్లాడు. లింగారెడ్డి రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా పాముకాటుకు గురై మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- నాలుగు తులాల బంగారం, రూ.లక్ష ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

మోత్కూరు: తాళం వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఆరెగూడెం రోడ్డులో నివాసముంటున్న చెకూరి మల్లేష్ దసరా పండుగకు భార్యాపిల్లలతో కలిసి ఆలేరు మండలం బహదూర్‌పేటలోని తన అత్తగారి ఇంటికి వెళ్లాడు. ఆదివారం రాత్రి మల్లేష్ ఇంటి తాళం పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం మల్లేష్ వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, మోత్కూరు ఎస్ఐ డి. నాగరాజు ఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ డిక్కీలో నుంచి రూ.10,800..

మండలంలోని పనకబండ గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మెన్ ఓర్సు సురేష్ సోమవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఏపీజీవీబీ ఎదుట తన బైక్‌ను పార్కింగ్ చేయగా.. అందులోని రూ.10,800 నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రెండు బైక్‌లపై వచ్చిన దొంగలు టవల్ అడ్డుగా పెట్టి నగదు దొంగిలించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


కాలువలో నుంచి వెంకటాచారి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు


వెంకటాచారి (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: నాగార్జునసాగర్ ఎడమ కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటున్న పొడగంటి వెంకటాచారి(37) బట్టల దుకాణంలో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. దసరా పండుగకు వెంకటాచారి తన సొంత గ్రామమైన మిర్యాలగూడ మండలం దొండవారిగూడెం గ్రామానికి భార్య, బంధువులతో కలిసి వెళ్లాడు. ఆదివారం సాయంత్రం ఈత కొట్టేందుకు తన బంధువులైన అయిన అంజద్, శ్రీపాద హర్షితతో కలిసి తక్కెళ్లపాడు తండా సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ వద్దకు వెళ్లారు. కాలువలో ఈత కొడుతూ నీటి ప్రవాహానికి వెంకటాచారి కొట్టుకుపోయాడు. సమాచారం తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు ఎన్ఎస్‌పీ అధికారులకు సమాచారం అందించి కాలువకు నీటి విడుదలను నిలిపివేసి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. సోమవారం తెల్లవారుజామున పోలీసులతో పాటు గ్రామస్తులు కాలువ కట్ట వెంట గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామం వరకు గాలిస్తూ వెళ్లగా.. వెంకటాచారి మృతదేహం గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని అగ్రహారం చెరువు సమీపంలో లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పొడగంటి సుష్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ధర్నా

- చల్లవానికుంట గ్రామంలో ఉద్రిక్తత
- పోలీసు బందోబస్తు ఏర్పాటు


చల్లవానికుంట గ్రామంలో ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

నాంపల్లి: వినాయక నిమజ్జనం రోజు జరిగిన గొడవలో గాయపడిన యువకుడు.. కొద్దిరోజుల తర్వాత కోమాలోకి వెళ్లి మృతిచెందాడు. యువకుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బంధువులు, కుటుంబ సభ్యులు సోమవారం మృతదేహంతో గ్రామంలో ధర్నా నిర్వహించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం చల్లవానికుంట గ్రామంలో గత నెల జరిగిన వినాయక నిమజ్జనంలో కొందరు యువకులు రెండు వర్గాలుగా విడిపోయి గొడవపడ్డారు. ఈ గొడవలో గ్రామానికే చెందిన రాపోతు మధు(20) మెడపై గాయాలయ్యాయి. దీంతో మధు కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఇరువర్గాలు రాజీపడ్డారు. నాలుగు రోజుల క్రితం మధు కళ్లు తిరిగి కిందపడిపోవడంతో ఆస్పత్రికి తరలించారు. మెడపై బలమైన దెబ్బ తగలడంతో మధు కోమాలోకి వెళ్లగా.. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మధు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా.. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ శోభన్‌బాబు గ్రామానికి చేరుకుని పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా నిందితులను కఠినంగా శిక్షిస్తామని బాధితులకు సర్దిచెప్పినా వారు వినిపించుకోలేదు. మధు మృతదేహాన్ని అతడిపై దాడి చేసిన వారి ఇంటి ముందు ఉంచి వెళ్లిపోయారు. దీంతో గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్ప్రేయర్ల ఎంపిక.. పిచికారీ సులువిక

పాడిపంట

పెద్దవూర: ప్రస్తుతం మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలకు పురుగులు, తెగుళ్లు ఆశిస్తున్నాయి. దీంతో రైతులు పంటలపై ఒకటికి రెండుసార్లు క్రిమిసంహారక మందులను పిచికారీ చేయడం పరిపాటిగా మారింది. పిచికారీ చేసేందుకు అవసరమైన స్ప్రేయర్లను సరిగ్గా ఎంపిక చేసుకోకపోతే రసాయన మందులు వృథా కావడంతో పాటు పిచికారీ చేసే వ్యక్తి శరీరంపై ప్రభావం పడుతుంది. ప్రస్తుతం పత్తి, మిరప, వరి పంటలకు చీడపీడల బెడదతో పాటు తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ రకాల స్ప్రేయర్లకు సంబంధించి పెద్దవూర మండల వ్యవసాయ అధికారి పి. సందీప్ వివరించారు.


తైవాన్ స్ప్రేయర్


నాప్‌సాక్ స్ప్రేయర్


ఫుట్ స్ప్రేయర్

తైవాన్ పవర్ స్ప్రేయర్..

ఇటీవల అన్ని రకరాల పంటలకు తైవాన్ పవర్ స్ప్రేయర్లతో మందులను పిచికారీ చేస్తున్నారు. దీని ఖరీదు కంపెనీలను బట్టి రూ.20వేల వరకు ఉంటుంది. తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో వెదజల్లే సామర్థ్యం దీనికి ఉంది. ఇతర వాటితో పోల్చితే దీనిలో సస్యరక్షణ మందులు మూడు వంతులు అధికంగా పోయాల్సి ఉంటుంది. రోజుకు సగటున 8 నుంచి 10 ఎకరాలలో పిచికారీ చేయవచ్చు. దీనికి అమర్చిన బెల్ట్ ద్వారా భుజాల వెనుక సులభంగా తగిలించుకోవచ్చు. ఈ పవర్ స్ప్రేయర్ చదరపు సెంటీమీటర్‌కు 30–35 కిలోల ఒత్తిడిని కలగజేస్తుంది. ధ్వని కాలుష్యం తక్కువ, ఒకేసారి 20 అడుగుల వెడల్పుతో పిచికారీ చేయవచ్చు. మందు వేగం గంటకు 60 కి.మీ. ఇంజిన్ సహాయంతో గాలి అధిక ఒత్తిడితో బయటకు రావడం వలన మందును స్ప్రేయర్ నాజిల్ 150–200 మైక్రాన్ సైజుతో ఉండే చిన్నచిన్న బిందువులుగా విడగొట్టి అధిక విస్తీర్ణంలో మందు పడేలా చేస్తుంది. నీటి బిందువులు గుండ్రంగా తిరగడం వలన ఆకుల పైభాగాన, కింది భాగాన పడతాయి. ఇంజిన్ పనిచేయడానికి గంటకు లీటర్ పెట్రోల్ అవసరం అవుతుంది. లీటర్ పెట్రోల్ ఆరు ఎకరాలకు సరిపోతుంది. నిమిషానికి 7.2 లీటర్ల మందును చల్లవచ్చు. బరువు తొమ్మిది కిలోలు. దీనిలో 20 లీటర్ల రసాయం ద్రావణం, 900 మి.లీ.ల పెట్రోల్ పడుతుంది. ఇటీవల వచ్చిన ఆధునాతన పవర్ స్ప్రేయర్లతో ఒక వ్యక్తి మందు ద్రావణ డబ్బాను భుజానికి తగిలించుకుంటే రెండు వైపులా ఇద్దరు వ్యక్తులు ఏకకాలంలో రసాయన మందును పిచికారీ చేసే పరిస్థితి వచ్చింది.

ఫుట్ స్ప్రేయర్

ఇది కాళ్లతో పనిచేస్తుంది. మినుము, పెసర వంటి పంటలతో పాటు కూరగాయ తోటలు, మామిడి, బత్తాయి వంటి పండ్లతోటల్లో సస్యరక్షణ మందులను పిచికారీ చేయవచ్చు. రోజుకు రెండు ఎకరాల్లో, పండ్ల తోటల్లో సగటున రోజుకు 150 చెట్లకు పిచికారీ చేయవచ్చు. ధర రూ.4వేల లోపే ఉంటుంది. ఇత్తడితో తయారైన ఫుట్ స్ప్రేయర్‌లో ప్రధానంగా చిన్న బ్యారల్, కదిలే పిస్టన్ ఉంటుంది. బ్యారల్ అడుగుభాగానికి ప్లాస్టిక్ గొట్టం కలపబడి ఉంటుంది. రెండో చివరన ఫిల్టర్ గరాటు బిగించబడి ఒక పాత్రలోని రసాయన ద్రావణంలో మునిగి ఉంటుంది. పెడల్‌ను కాళ్లతో తొక్కినప్పుడు పిస్టన్ బ్యారల్‌లో పైకి కిందికి కదలడంతో ద్రావణం బ్యారల్ పైభాగానికి చేరి అక్కడి నుంచి గాలి గది ద్వారా రెండో గొట్టం చివర ఉన్న నాజిల్ గుండా బయటకు వెళ్తుంది. గాలి గది అమరిక వల్ల ద్రావణంపై పీడనం ఎల్లప్పుడు సమానంగా ఉంచి పిచికారీ ఒకే విధంగా ఉండటానికి తోడ్పడుతుంది. దీనిలో చదరపు సెంటీమీటర్‌కు 8 నుంచి 13 కిలోల ఒత్తిడి తీసుకురావచ్చు. అధిక ఒత్తిడి వలన ఎత్తుగా ఉన్న మామిడి చెట్లకు సులభంగా పిచికారీ చేయవచ్చు.

నాప్‌సాక్ స్ప్రేయర్

దీని బరువు తక్కువగా ఉండేందుకు పాలిథీన్‌తో తయారు చేస్తారు. స్ప్రేయర్ ట్యాంకు పరిమాణం 15–16 లీటర్లు. దీనికి ఉన్న బెల్ట్‌ల ద్వారా భుజాల వెనక సులువుగా తగిలించుకోవచ్చు. పంట అన్ని దశల్లో మందు పిచికారీకి ఈ స్ప్రేయర్ ఉపయోగపడుతుంది. ధర రూ.2వేల లోపే ఉంటుంది. ట్యాంకు లోపలి భాగాన పంపు, గాలి గది, పైభాగాన ఒక రంధ్రానికి ప్లాస్టిక్ గొట్టం బిగించబడి ఉంటుంది. రెండో చివర నాజిల్ ఉంటుంది. ట్యాంకులో అమర్చబడిన పిస్టన్ పైకి కిందకు కదలడం వలన ద్రావణంపై ఒత్తిడి ఏర్పడి రబ్బరు గొట్టం ద్వారా నాజిల్ ద్వారా బయటకు రసాయనం వెలువడుతుంది. పిస్టన్ కదిలించటానికి హ్యాండిల్ ఉంటుంది. దీనితో రసాయన ద్రావణం అంతటా సమంగా పడుతుంది.